ప్రజాశక్తి
గురువారం 2 మార్చి 2023
5
విజయనగరం



గ్యాస్ ధర పెంపుపై నేడు సిపిఎం నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరం


కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత గ్యాస్ ధరను విపరీతంగా పెంచి సబ్సిడీని పూర్తిగా ఎత్తివేసిందన్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, తాజాగా సిలిండర్‌పై రూ.50 పెంచడం దుర్మార్గమైన చర్యని పేర్కొన్నారు. ఇలా పెంచుకుంటూ పోతే రాబోయే రోజుల్లో పేదలకు కట్టెల పొయ్యిలే దిక్కులా ఉందన్నారు. గ్యాస్ ధర పెంపునకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో ప్రజలంతా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.



కట్టెల పొయ్యిలతో వంట చేసుకోవాల్సిందే

గ్యాస్ ధరలు పెరగడంతో కట్టెల పొయ్యితో వంటలు చేసుకోవాల్సిందే. గ్యాస్ సిలెండర్ ధర రూ.400 నుంచి నేడు రూ.1100కు పెరిగింది. ఇదంతా బిజెపి ప్రభుత్వ పుణ్యమే. గ్యాస్‌పై సబ్సిడీ ఎత్తి వేయడం అన్యాయం. పెరిగిన గ్యాస్ ధరలు తగ్గించాలి.

– సిహెచ్ రాధ, బొబ్బిలి



వంట గ్యాస్ ధరకు మళ్లీ రెక్కలొచ్చాయి. ఇప్పటికే ఓవైపు పెట్రోల్, డీజిల్ ధరలు, మరోవైపు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో ప్రజల నెత్తిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మళ్లీ భారం మోపింది. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్‌పై గత ఏడాది మార్చిలో రూ.50, జులైలో రూ.50 పెంచిన బిజెపి ప్రభుత్వం తాజాగా ఒక్కో సిలిండర్‌పై మరో రూ.50 పెంచింది. అంతేకాకుండా వాణిజ్య సిలిండర్ ధరను రూ.350.50 పెంచి పరోక్షంగా ఇతర ధరల పెంపుదలకు కారణమైంది.

బండ బాదుడు

- మళ్లీ పెరిగిన గ్యాస్ సిలిండర్ల ధరలు
- వంట గ్యాస్‌పై రూ.50 పెంపు
- వాణిజ్య సిలిండర్‌పై రూ.350.50 భారం
- ప్రజలపై నెలకు రూ.1.50 కోట్ల వడ్డింపు

ప్రజాశక్తి – విజయనగరం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలను మళ్లీ పెంచింది. 14.5 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రూ.1060 ఉండగా, తాజాగా రూ.50 పెంచడంతో రూ.1110 అయ్యింది. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలపై పెనుభారం పడింది. విజయనగరం జిల్లాలో దీపం, ఉజ్వల, సిఎస్ఆర్ తదితర పథకాల ద్వారా సుమారు 6,61,570 గ్యాస్ కనెక్షన్లు ఉండగా, వీటిలో సాధారణ గ్యాస్ కనెక్షన్లు 3,29, 862 కనెక్షన్లు ఉన్నాయి. నెలకు సగటున సుమారు 3లక్షల సిలిండర్ల వినియోగం జరుగుతోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో 2,53,242 గ్యాస్ కనెక్షన్లు ఉండగా, వీటిలో నెలకు 1.30లక్షల సిలిండర్లు వినియోగం జరుగుతోంది. ఈ లెక్కన విజయనగరం జిల్లాలో నెలకు ఒక కోటీ 50లక్షల రూపాయలు, పార్వతీపురం మన్యం జిల్లాపై రూ.65.50లక్షలు భారం పడుతోంది.

విజయనగరం జిల్లాలో కమర్షియల్ (వాణిజ్య) సిలిండర్లు 25,261 ఉన్నాయి. దీని ధర 2070 ఉండగా, బిజెపి ప్రభుత్వం తాజాగా రూ.350.50పైసలు అదనంగా పెంచింది. దీంతో సిలిండర్ ధర రూ.2420.50కు చేరింది. వాణిజ్య సిలిండర్‌పై ఈ ఏడాది జనవరిలో రూ.25 పెంచగా, తాజాగా మరింత భారం వేశారు. వీటి ధర పెంపుతో తినుబండారాల ధరలు విపరీతంగా పెరగనున్నాయి.

సబ్సిడీని ఇప్పటికే ఎత్తేసిన కేంద్రం

గతంలో సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసేవారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత గ్యాస్ కొనుగోలు చేశాక వినియోగదారుల ఖాతాల్లో సబ్సిడీ జమ చేస్తామని చెప్పింది. తొలినాళ్లలో గృహ వినియోగదారులకు రూ.220 వరకు సబ్సిడీ చెల్లించిన కేంద్రం క్రమంగా కోత విధించి క్రమంగా తగ్గించి, ఏడాది క్రితం నుంచి పూర్తిగా ఎత్తివేసింది. మరోవైపు పెట్రోల్, డీజిల్ ధరలు, వంట నూనెల ధరలు కూడా అమాంతంగా పెరిగిపోయాయి. దీంతో, పేదలు గ్యాస్ ధరలు భరించలేని పరిస్థితి దాపురించింది.

పింఛను బతుకులపై పెనుభారం



నా భర్త పింఛనుపై ఆధారపడి బతుకుతున్నాం. ఎడతెరపి లేకుండా పెరుగుతున్న గ్యాస్ ధరలకే సగం సొమ్ము చెల్లించాల్సి వస్తుంది. ఇక మందూ మాకూ, కరెంటు బిల్లు చెల్లింపు కోసం వృద్ధాప్యంలోనూ పనుల కోసం పరుగెత్తాల్సిన పరిస్థితి వస్తుంది. నిత్యావసర ధరలు తగ్గించకుండా, మరోవైపు భారాలు మోపితే పేదల బతుకులు మారే పరిస్థితి లేదని పాలకులు గ్రహించాలి.

– రాజమండ్రి సింహాచలం, వెంకంపేట, పార్వతీపురం మండలం

పెంచడమే తప్ప తగ్గించడం లేదు..



ఈ ప్రభుత్వాలు ధరలు పెంచడమే తప్ప తగ్గించడం లేదు. మా పేదోళ్ల బాధలు ఎవరికీ పట్టడం లేదు. ఒకేసారి గ్యాస్ సిలిండర్ రేటు రూ.50 పెంచేస్తే ఎలా బతుకుతాం. పేదోళ్లకు ఎప్పుడూ కష్టాలే. గతంలో సబ్సిడీ ఇచ్చేవారు. ఇప్పుడు అది కూడా ఇవ్వడం లేదు. ఒక చేత్తో సాయం చేసి మరో చేతితో లాగేసుకుంటున్నారు.

– ఎం.అర్జునమ్మ, సింగరాయి గ్రామం, వేపాడ మండలం

మరో 47 మందికి ఆర్అండ్ఆర్ ప్యాకేజి

- ఫలించిన ఎయిర్‌పోర్టు నిర్వాసితుల పోరాటం
- త్వరలో జిఎంఆర్‌కు భూమి అప్పగింత



మరడపాలెంలో ఇటీవల నిర్వాసితుల ఇల్లు కూల్చివేస్తున్న దృశ్యం (ఫైల్)

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

ఎయిర్‌పోర్టు నిర్వాసితుల పోరాటం ఫలించింది. దిగివచ్చిన అధికార యంత్రాంగం సానుకూలంగా స్పందించింది. మరో 47కుటుంబాలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వర్తింపజేసేందుకు నిర్ణయించింది. ఇప్పటికే గ్రామాలు ఖాళీ అయిన నేపథ్యంలో నిర్మాణం కోసం జిఎంఆర్ సంస్థకు భూమి అప్పగించేందుకు రంగం సిద్ధమైనట్టు సమాచారం. ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం భోగాపురం మండలంలో 2,700ఎకరాలు సేకరించిన విషయం విధితమే. ఇందులో భాగంగా మరడపాలెం, బొల్లెంకులపాలెం, ముడసర్లపాలెం, రెల్లిపేట గ్రామాలను పూర్తిగా ఖాళీ చేయించారు. ఈ గ్రామాల్లోని 376కుటుంబాల వారికి మాత్రమే ఆర్ఆర్ ప్యాకేజీ వర్తింప జేయడంతో మిగిలినవారు తమకు కూడా ప్యాకేజీ ఇవ్వాలని పట్టుబట్టిన విషయం విధితమే. ఈ కుటుంబాలను సిపిఎం నాయకులు పరామర్శించి మద్దతు తెలిపారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఈనేపథ్యంలో ఆయా గ్రామాలను సందర్శించిన కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ బాధితులందరికీ న్యాయం చేస్తామంటూ ప్రకటించిన విషయం విధితమే.

ఈనేపథ్యంలో కొత్తగా 28కుటుంబాలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీని ప్రతిపాదిస్తూ నివేదిక పంపారు. మరో 19మంది లీగల్‌హాయిర్‌లకు (తండ్రి లేదా తల్లి చనిపోయినయిన అర్హులకు) వర్తింజేయాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. వీరందరికీ మిగిలినవారి మాదిరిగా 5సెంట్ల స్థలం, 9.50లక్షల నగదు అందనుంది. పోరాడితే పోయేదేం లేదు... బానిస సంకెళు తప్ప అన్నట్టుగా ఇటీవల తమకు న్యాయం చేయాలంటూ ఎయిర్‌పోర్టు నిర్వాసితులు చేసిన పోరాటం వల్లే కోల్పోతున్నామనుకున్న నష్టం పూడ్చుకున్నట్టైంది. మరడపాలెంలో స్థానికతతో కూడిన చిరునామాలు లేని వలసకూలీలకు మాత్రం ఆర్అండ్ఆర్ చట్టం వర్తింపజేయలేమని అధికారులు చేతులెత్తేశారు. కానీ, కావాలంటే సెంటు లేదా సెంటున్నర స్థలాలు ఇవ్వడానికి తమకు అభ్యంతరం లేదని, ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు చెబుతున్నారు. ఇళ్లు ఖాళీ చేసిననాటికి 18ఏళ్లు పైబడిన వారందరికీ ప్యాకేజీ వర్తింజేయాలన్న వాదనను అధికార యంత్రాంగం ససేమిరా అంటోంది. ఆర్అండ్ఆర్ చట్టం ప్రకారం నోటిఫికేషన్ ఇచ్చిన నాటికి మాత్రమే 18ఏళ్ల నిండాలని, ఆ తరువాత నిండినవారికి వర్తించబోదని చెబుతున్నారు. మరోవైపు గ్రామాలు ఖాళీ అయిన నేపథ్యంలో ఎయిర్‌పోర్టు ప్లానింగ్, నిర్మాణ ప్రక్రియను ముందుకు నడిపేందుకు అనుగుణంగా జిఎంఆర్ సంస్థకు భూమిని అప్పగించేందుకు అవసరమైన చర్యలు ప్రారంభం కానున్నాయి.

నిర్వాసితులందరికీ న్యాయం చేస్తాం



నిర్వాసితులందరికీ న్యాయం చేస్తాం. ఈ విషయంలో నిర్లక్ష్యం, వివక్ష అనే ప్రసక్తేలేదు. ఊళ్లు కోల్పోయిన ప్రతి ఇంటికీ తహశీల్దార్‌ను వెంటబెట్టుకుని వెళ్లాను. ఈ సందర్భంగా కొంతమంది అప్పట్లో గుర్తింపునకు నోచుకోలేదు. నోటిఫికేషన్ తరువాత కొంతమంది యజమానులు చనిపోయారు. అప్పట్లో గుర్తింపునకు నోచుకోనివారికి, నోటిఫికేషన్ తరువాత చనిపోయిన యజమానుల వారసులకు ప్యాకేజీ వర్తింపజేసేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నాం. మిగిలినవారికి ప్రభుత్వం తరపున సెంటు లేదా 1.50సెంట్ల స్థలాలను మంజూరు చేస్తాం.

ఎం.వి సూర్యకళ, ఆర్‌డిఒ, విజయనగరం

సైన్సు విజ్ఞాన ప్రదర్శనలో యశస్వినికి ప్రథమ స్థానం

అభినందించిన కలెక్టర్, డిఇఒ



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయవాడలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ లో జిల్లాకు చెందిన ధర్మవరం జెడ్‌పి హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని వి.యశస్విని ప్రథమ స్థానం సాధించింది. గ్లోబల్ వార్మింగ్ నుంచి ప్లాసిక్ రహిత సమాజం కోసం, అరటి చెట్టు నుంచి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కావాల్సిన ఉత్పత్తులు తయారు చేసిన ప్రోజెక్ట్‌కు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం వచ్చింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో, జిల్లా సైన్స్ అధికారి ఎం.కృష్ణారావు, గైడ్ టీచర్ వి.రమేష్, విద్యార్థిని యశశ్విణి బుధవారం కలెక్టర్ సూర్యకుమారిని కలిసారు. యశస్విణిని, పాల్గొన్న ఇతర విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. విద్యార్థులను వైజ్ఞానిక ప్రదర్శనల పట్ల మరింత ప్రోత్సహించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ఇలాంటి పరిశోధనలు ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్‌తో పాటు డిఆర్‌ఒ ఎం.గణపతిరావు కూడా విద్యార్థులను అభినందించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశం



సంస్కృత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి స్థానం కోసం ఈనెల 13న జరగనున్న ఎన్నికల ప్రక్రియలో భాగంగా పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ ఎ.సూర్య కుమారి బుధవారం సందర్శించారు. జిల్లా ఎస్‌పి దీపికా పాటిల్‌తో కలిసి ఏర్పాట్లను తనిఖీ చేశారు. జోనల్, పోలింగ్ అధికారులకు పలు ఆదేశాలు జారీచేశారు. కంటోన్మెంట్‌లోని మున్సిపల్ ఉన్నత పాఠశాల, మహారాజా కళాశాల, కస్పా మున్సిపల్ ఉన్నత పాఠశాల, మహారాజా సంస్కృత ఉన్నత పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. కేంద్రాల్లో లైట్లు, ఫ్యాన్లు పని చేసేలా చూడాలన్నారు. ఎండ తీవ్రంగా ఉండటం వల్ల, నీడకోసం షామియానాలు వేయాలన్నారు. ఓటర్లకు అవగాహన కల్పించేందుకు క్యూలైన్ల ప్రక్కన నమూనా బ్యాలెట్ పత్రాలను అంటించాలని సూచించారు. ప్రతీ పోలింగ్ బూత్‌కు వేర్వేరు క్యూలైన్లను ఉండాలని, అందుకు తగినట్టుగా బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఓటర్లు ఇబ్బంది పడకుండా, ఓటింగ్ ప్రక్రియ వేగంగా జరిగేందుకు అవసమైన అన్నిరకాల చర్యలనూ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలవద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌పి దీపికా పాటిల్ చెప్పారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ త్వరగా పూర్తి చేయాలి

గ్రాడ్యుయేట్ ఓటర్లకు ఓటర్ స్లిప్పుల పంపిణీ త్వరగా పూర్తి చేయాలని, బిఎల్‌ఒలను కలెక్టర్ ఆదేశించారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో, ఓటర్ స్లిప్పుల పంపిణీపై బిఎల్‌ఒలను ఆరా తీశారు. తక్కువ స్లిప్పులను పంపిణీ చేసినవారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంపిణీ శతశాతం జరగాలని, స్వయంగా వెళ్లి స్లిప్పులను ఓటర్లకు అందజేయాలని సూచించారు. ఓటర్ స్లిప్పుల పంపిణీలో, ఎన్నికల ప్రక్రియలో వలంటీర్లను ఎట్టిపరిస్థితిలోనూ వినియోగించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. పర్యటనలో జోనల్ ఎన్నికల అధికారులు పిఎన్‌వి లక్ష్మీనారాయణ, బి.రాంగోపాల్, విజయనగరం డిఎస్‌పి శ్రీనివాసరావు, తాహశీల్దార్ బంగార్రాజు, ఇతర రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

11 ఏళ్లు బందీ

భార్యపై న్యాయవాది కర్కశం



సాయిసుప్రియను బయటకు తీసుకొస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-విజయనగరం

పవిత్రమైన న్యాయవాద వృత్తిలో ఉన్న ఓ న్యాయవాది ఆ వృత్తికే కళంకం తెచ్చాడు. తన తల్లి, సోదరుడు మాటలు విని ఏకంగా 11 సంవత్సరాల పాటు తాళి కట్టిన భార్యను ఇంట్లో బంధించి బయట ప్రపంచానికి దూరం చేశాడు. చీకటి గదిలో బక్క చిక్కిన శరీరంతో 11 ఏళ్ల పాటు కఠినాతి కఠినమైన జీవితాన్ని ఆమె అనుభవించింది. తన న్యాయవాద వత్తిని అడ్డం పెట్టుకొని బయట ప్రపంచానికి, తల్లిదండ్రులకు దూరం చేసిన ప్రబుద్ధుడు గోదావరి మధుసూదన్. వన్‌టౌన్ సిఐ బి. వెంకట్రావు తెలిపిన వివరాలు ప్రకారం.. శ్రీ సత్య సాయి పుట్టపర్తి జిల్లాకు చెందిన సాయి సుప్రియ ను విజయనగరంలోని కంటోన్మెంట్ బాలాజీ మార్కెట్ సమీపంలో ఉంటున్న గోదావరి మధుసూదన్ 2008లో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం కలిగిన అనంతరం న్యాయవాది మధుసూదన్ తన తల్లి గోదావరి ఉమామహేశ్వరితో పాటు తన తమ్ముడు మాటలు విని పట్టుకున్న భార్యను వేధించాడు. బయట ప్రపంచానికి దూరం చేస్తూ చీకటి గదిలో 11 సంవత్సరాలు పాటు బంధించాడు. బాధితురాలు కుటుంబ సభ్యులు ఎన్ని మార్లు అడిగినప్పటికీ న్యాయవాది తన వృత్తిని అడ్డం పెట్టుకొని బాధితురాలు కుటుంబ సభ్యులను బెదిరించేవాడు. దీంతో దిక్కుతోచని స్థితిలో తమ కుమార్తె ఏమైందో తెలియక వారు నరకయాతన అనుభవించారు. సహనం కోల్పోయిన బాధితురాలి తల్లిదండ్రులు ఇటీవల జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేయడంతో ఒకటవ పట్టణ పోలీసులు గతనెల 28 మధుసూదన్ ఇంటికి వెళ్లి పరిశీలించారు. తమ ఇంటిని తనిఖీ చేసే అధికారం మీకు లేదని, తనిఖీ చేసేందుకు కోర్టు ఆదేశాలు ఏమైనా ఉన్నాయా అంటూ మధుసూదన్ పోలీసులను ప్రశ్నించడంతో పోలీసులు, బాధితురాలి తల్లిదండ్రులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి సెర్చ్ వారెంట్ తీసుకువచ్చారు. దీంతో బుధవారం పోలీసులు న్యాయవాది మధుసూదన్ ఇంటిని తనిఖీ చేయగా సాయి ప్రియ బక్క చిక్కిన శరీరంతో చీకటి గదిలో దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తూ ఓ మూలన కనిపించింది. దీంతో పోలీసులు ఆమెను బయటకు తీసుకువచ్చి న్యాయస్థానంలో హాజరు పరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు నిందితులపై చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు.



సంయుక్త స్కూల్ కరస్పాండెంట్‌ను ఓటు అభ్యర్థిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ, ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

సమస్యలపై పోరాడే పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించండి

గోదావరి జిల్లా ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న, వాటి పరిష్కారానికి పోరాడుతున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం, రింగ్ రోడ్, బెల్లం మార్కెట్ తదితర ప్రాంతాల్లో వాకర్స్‌ను కలిసి కోరెడ్ల రమాప్రభకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎమ్మెల్సీతో పాటు పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ, ప్రజా సంఘాల నాయకులు సంయుక్త స్కూల్ కరస్పాండెంట్ గోవిందరావును కలిశారు. పలు విద్యా సంస్థల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిలు వంత పాడుతున్నాయని తెలిపారు. విశాఖ రైల్వే జోన్ కోసం, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక, ప్రజా సంఘాలతో కలిసి పిడిఎఫ్ ఎమ్మెల్సీలే పోరాడుతున్నారని చెప్పారు.

250 ప్రజా సంఘాల బలపర్చుతున్న కోరెడ్ల రమాప్రభ ఉత్తరాంధ్ర ప్రజలు గొంతై ఇక్కడి సమస్యలపై గళమెత్తుతారని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బి.ఉమామహేశ్వరరావు, గంట శ్రీరామ్, ఎ.బాలకృష్ణ, గంట సురేష్, ఎస్ రమణ, గొర్లి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ధీరా ఫౌండేషన్‌కు జివికె కన్వీనర్ కృతజ్ఞతలు

విజయనగరం టౌన్ : అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గురజాడ విజ్ఞాన కేంద్రానికి ధీర ఫౌండేషన్ అధినేత డాక్టర్ బొత్స సందీప్ విరాళం అందించినందుకు విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కె.శ్రీనివాసరావు, కో-కన్వీనర్ బి.సతీష్ కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఎఫ్ఐ ద్వారా ఈ విరాళాన్ని అందించారని తెలిపారు. ఈ విజ్ఞాన కేంద్రం ద్వారా కరోనా సమయంలో ఐసోలేషన్ సెంటర్, అదే విధంగా బట్టలు, ఆహారం పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేపట్టి పేదలను ఆదుకున్నామని తెలిపారు. పేద విద్యార్థులకు ఆదుకునేందుకు, వారిని సాంకేతికంగా అభివృద్ధి చేసేందుకు కంప్యూటర్ శిక్షణ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. ఎపి ఆర్‌జెసి కోచింగ్ కూడా ప్రారంభించామన్నారు దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే ఈ సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తామని తెలిపారు.

జెఎన్‌టియులో రక్తదాన శిబిరం

విజయనగరం టౌన్ : జెఎన్‌టియు కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రినిపల్ శ్రీ కుమార్ మాట్లాడుతూ రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేసినట్లే అన్నారు. వివిధ ప్రమాదాలు, ఆపరేషన్లు జరిగిన వారికి రక్తం చాలా అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. సర్వ జన ఆసుపత్రి రక్తనిధి కేంద్రం సిబ్బంది రక్తం సేకరించారు. కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'జంగ్లీ కులపతి ఆత్మకథ' స్ఫూర్తిదాయకం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డివిజి శంకర్రావు, కట్టమణి, విజయకుమార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ తేజస్వి కట్టమణి రాసిన 'జంగ్లీ కులపతి అంతంలేని పోరాటం -ఒక ఆత్మ కథ' అనే పుస్తకం ఎంతో స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్‌పి, రచయిత డాక్టర్ డివిజి శంకర్రావు అన్నారు. ఈ పుస్తకం ద్వారా రచయత తన అనుభవాలను పొందుపరచారని, ఈ విషయాలు యువతను ఒకింత ఆలోచించేలా చెయ్యడమే కాకుండా కొన్ని చాప్టర్లలో కంట తడిని కూడా పెట్టించాయని పేర్కొన్నారు. స్థానిక కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో బుధవారం ఈ పుస్తకాన్ని ప్రముఖ పుస్తక ప్రచురణ సంస్థ ఎమెస్కో అధినేత విజయ కుమార్ ఆవిష్కరించి డాక్టర్ డి వి జి శంకర్రావుకు ప్రథమ కాపీని అందజేశారు. అనంతరం అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవీ పుస్తకాన్ని విశ్లేషిస్తూ ఒక మేకలు మేపుకొనే, మట్టిపని చేసే వ్యక్తి కష్టపడి పనిచేసే తత్త్వం, అకుంఠిత దీక్ష, మానవత్వం కలగలిపి ఏవిధంగా విశ్వ విద్యాలయాన్ని అభివృద్ధి పదంలో నడిపించారో కళ్లకు కట్టినట్లుగా రాసారని తెలిపారు. విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ జక్కు రామ కృష్ణ మాట్లాడుతూ ఉప కులపతిగానే కాకుండా జాతీయ విద్యావిధానం డ్రాఫ్ట్ , ఇంప్లీమెంటేషన్ సభ్యునిగా ఎదగడం, వివిధ దేశాలు సందర్శించి భారత జాతి గౌరవాన్ని ఇనుమడింప జేసిన వైనాన్ని కొనియాడారు. సిటియు ఎఒ ఎన్‌విఎస్ సూర్యనారాయణ సమన్వయ కర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో సీతం విద్యాలయాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు, నాలుగెస్సుల రాజు, ఎన్.సూర్యకాంతి, స్పార్క్ పద్మనాభం, కమలానాభం, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఎన్‌వైకె అధికారిగా వెంకట్

విజయనగరం కోట : నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారిగా కె. వెంకట్ ఉజ్వల్ అదనపు బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా కార్యాలయ గణాంక అధికారి, కార్యక్రమ సహాయకులు వి.పృధ్వి, యువజన సంఘాల ప్రతినిధులు అభినందించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

మండల స్థాయిలో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం

ప్రతి సోమవారం మండల స్థాయి లో స్పందన నిర్వహించి, ప్రజల నుండి వినతులు స్వీకరించాలని జిల్లా కలెక్టర్ సూర్య కుమారి అదేశించారు. ఈ స్పందనకు మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని, హాజరు కూడా తీసుకోవాలని తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో స్పందన పై నోడల్ అధికారులతో, స్పందన ఆడిట్ అధికారులు, ఎక్కువగా అర్జీలు అందే అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పందన వినతులుపై సి.ఎం స్వయంగా ఆర్జీదారులతో మాట్లాడే అవకాశం ఉందని, దీని ప్రాధాన్యతను ప్రతి అధికారులు తెలుసుకోవాలని అన్నారు. సోమవారం మండల అధికారులతో ఇతర సమావేశాలు నిర్వహించవద్దని అన్నారు. ప్రతి శాఖ అధికారి ప్రతి రోజు వారీ లాగిన్ లో చూడాలని, వినతులు సోమవారమే కాకుండా మరే విధంగానైనా రావచ్చునని అన్నారు. ఏ ఒక్క లాగిన్‌లో కూడా చూడని అర్జీలు ఉండకూడదదన్నారు. స్పందన అర్జీదారులు నాణ్యమైన , సరైన సమాధానాలను ఇవ్వాలని, తప్పుడు ఎండార్స్మెంట్ వేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిఆర్ఒ గణపతి రావు, అధికారులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

వంగర : పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులంతా సమిష్టిగా కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి వై.దుర్గారావు తెలిపారు. మండలంలోని కోనంగిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం పరిశీలించారు. అక్కడ చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు గణితంపై ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఇంకా బాగా వండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ప్రధానోపాధ్యాయుడు జామి ఆదినారాయణ, బొచ్చ ఎల్లయ్య, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సేవలపై అవగాహన

రేగిడి : గ్రామ సచివాలయాల సేవలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావు అన్నారు. ఈ మేరకు బుధవారం మునకలవలస, పారంపేట, ఉణుకూరు, అంబాడ వెంకటాపురం తదితర గ్రామ సచివాలయాలను ఆయన పరిశీలించారు. గ్రామ సచివాలయాల సర్వీసులు ప్రజలకు అవగాహన కల్పించిన నాడే సచివాలయ వ్యవస్థపై నమ్మకం ఉంటుందన్నారు. ప్రభుత్వ విధులు, నిధులు, ఖర్చులు, జమలు వంటివి ఎం బుక్ ప్రాప్తికి ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలన్నారు. పారిశుధ్యం మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీధిలైట్లు, కాలువల పూడిక తీతలు తీయించాలన్నారు. ఈయనతోపాటు సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు.

ఇంటి పన్ను విధిగా వసూలు చేయాలి

వేపాడ : గ్రామాల్లో ఇంటి పన్నులను విధిగా వసూలు చేయాలని ఇఒపిఆర్‌డి సూర్యనారాయణ సూచించారు. మండలంలోని కేజీపూడి, బొద్దాం సచివాలయాల్లోని సిబ్బందితో బుధవారం ఆమన సమావేశమయ్యారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి ఆదాయం వచ్చే పనులపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో మండల పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎండిఎం ఆలీ, పంచాయతీ కార్యదర్శి పద్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుండి రామాలయ వార్షికోత్సవం

వేపాడ : మండలంలోని జాకేరులో గురువారం నుంచి మూడు రోజులు పాటు శ్రీరామాలయ 9వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. తొలి రోజు కళ్యాణ వేడుకలు, భజన కార్యక్రమాలు, కోలాటాలు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. రెండో రోజు జబర్దస్త్ ఈవెంట్, మూడో రోజు జిల్లాస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన, గుర్రపు పరుగు ప్రదర్శన నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, గ్రామ పెద్ద అప్పలనాయుడు, రామాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు సహాయ సహకారాలతో నిర్వహించనున్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ పట్నాయక్

వేపాడ : స్థానిక సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంతవరకు ఆధార్ నమోదుకు వచ్చిన ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆధార నమోదు చేయాలన్నారు. ఇంతవరకు ఆధార్ నమోదుకు వచ్చిన వారి వివరాలు అడిగి తెలుసుకుఆన్నరు. రోడ్డు విస్తరణలో భాగంగా వల్లంపూడి ప్రాథమిక పాఠశాల ప్రహరీ కొంతవరకు తీసివేయనుండటంతో ఎంత వరకూ తొలగిస్తారనే అంశంపై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె భాగ్యలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించండి


మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసరావు

వంగర: మండలంలో వివిధ గ్రామాలలో ఉపాధి హామీ పనులు చేసే చోట తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స పెట్టెలు వంటి సౌకర్యాలు తప్పని సరిగా కల్పించాలని ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీ గిట్టిబాటు అయ్యేవిధంగా ఉపాధి వేతన దారులకు అవగాహన కల్పించి పనులు చేయించాలని వివరించారు. ఈ సమావేశంలో ఎపిఒ సామంతుల సంఘం నాయుడు, ఈసీ హరినారాయణ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అమెజాన్‌కు బొద్దాం యువకుడు ఎంపిక

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన జనపరెడ్డి సతీష్ అమెజాన్‌లో రూ.21.9లక్షల ప్యాకేజీతో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అతన్ని తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

పేదలకు ఆహారం పంపిణీ

విజయనగరం టౌన్ : అన్నార్తుల ఆకలి బాధను తీర్చడంలోనే నిజమైన ఆనందం ఉంటుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. బుధవారం ఆ దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక థెరిసా క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా సర్వజన ఆస్పత్రి ఆవరణలో తమ చేతుల మీదుగా రోగుల కుటుంబ సభ్యులకు,పేదలకు ఆహార పదార్థాలను అందించి, తమ ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ ప్రత్యేక దినాల్లో పేదలను ఆదుకోవడం వల్ల సంతృప్తి లభిస్తుందన్నారు. సమాజ హితం కోరి చేసే ఏ మంచిపనికైనా ఆదరణ ఉంటుందన్నారు. ఏ అవకాశం వచ్చినా పేదలను ఆదుకోవడమే ధ్యేయంగా తాము ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో థెరిసా క్లబ్ అధ్యక్షులు కురియకోష్, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పార్కింగ్ సౌకర్యం కల్పించాలని వినతి

విజయనగరం టౌన్ : నగరంలో పార్కింగ్ స్థలాలు లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పార్కింగ్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గదుల వెంకట్రావు ఆధ్వర్యంలో జిల్లా ఎస్‌పికి, ఆర్‌టిఒకు బుధవారం వినతి అందజేశారు. పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో వాహనదారులు ఎక్కడ బడితే అక్కడ టూ వీలర్, త్రీ వీలర్ బండ్లను పార్కింగ్ చేయడం వలన పోలీసులు ఫోటోలు తీసి అధిక చలానాలు వసూలు చేస్తున్నారని తెలిపారు. నగరంలో హెల్మెట్ వాడని వారికి అపరాధ రుసుం వసూలు చేస్తున్నారని తెలిపారు. కావున అన్ని కూడల్లోను పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చోడిఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి ముదిలి నాగభూషణం, మజ్జి అప్పారావు, ఎస్‌ఎస్ రెడ్డి పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించకపోతే సమ్మె

విజయనగరం కోట : ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు, సెక్యూరిటీ గార్డులకు ప్రభుత్వ జీవో ల ప్రకారం పెరిగిన జీతాలు చెల్లించకపోతే సమ్మె బాట పట్టక తప్పదని ఏ.పి మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు బుగత అశోక్ ప్రభుత్వ వైద్యాధికారులను, కాంట్రాక్టర్లను హెచ్చరించారు. బుధవారం డిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్లకి, సెక్యూరిటీ గార్డులకు 3 నెలలుగా జీతాల బకాయిలు ఉన్నాయని, ప్రభుత్వం ఇచ్చిన జీఓ ల ప్రకారం వేతనాలు పెంచాలని, పి.ఎఫ్, ఇఎస్ఐ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎస్.రంగరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి ఖాదర్‌బాబా గంధ మహోత్సవాలు

విజయనగరం టౌన్: బాబామెట్టలోని ఖాదర్‌బాబా క్షేత్రంలో హజరత్ సూఫీ సెహన్షా సయ్యద్ ఖాదర్ వలి 64వ గంధ మహోత్సవాలు గురువారం నుంచి ఘనంగా జరుగుతాయని దర్బార్ షరీఫ్ ధర్మకర్త(ముతవల్లి) హజరత్ ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ ఔలియా కుమారులు డాక్టర్ ఖలీల్ బాబు తెలిపారు. తొలి రోజు ఉదయం దివ్య ఖురాన్ పారాయణం, జెండా మహోత్సవం, చాదర్ సమర్పణతో ఉరుసు ఉత్సవాలు ప్రారంభమౌతాయని తెలిపారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు ఖురాన్ పఠనం, పది గంటలకు దర్బార్ షరీఫ్ నుంచి సూఫీ సుగంధ మహోత్సవం జరుగుతాయని తెలిపారు.

సమగ్ర సస్యరక్షణ పై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - కొత్తవలస

జీడి తోటల పెంపకంలో సమగ్ర సస్య రక్షణపై రైతులకు మండలంలోని సంతపాలెం ఆర్‌బికె వద్ద శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంటూరు జీడి పరిశోధన కేంద్రం నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు, జిల్లా ఉద్యానశాఖ అను సంధానంగా బుధవారం ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ శాస్త్రవేత్త కె. ఉమామహేశ్వర రావు, కీటక శాస్త్రవేత్త బి. నాగేంద్ర రెడ్డి జీడి పంట ఆశించిన పురుగులు, తెగుళ్ళ, పోషకాల యాజమాన్యంపై వివరించారు. జీడిలో ఈ సంవత్సరం మంచు వల్ల టీ దోమ వల్ల కొంతవరకు పూత పోయిందన్నారు.ఉద్యాన సహాయ సంచాలకులు శైలజ మాట్లాడుతూ జీడి పంటలో కొమ్మ కత్తిరింపులు, సస్య రక్షణా చర్యలు పాటించి నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారిని ఉమా భరణి, ఉద్యాన అధికారులు, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు రైతులు పాల్గొన్నారు.


కొత్తవలస: రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు


డెంకాడ: రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

చొల్లంగి పేటలో పొలం బండి

డెంకాడ : మండలంలోని చొల్లంగిపేట మొక్కజొన్న పంటలో బుధవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ పూడి నిర్మల, ఎరువుల యాజమాన్యం, పురుగుల యాజమాన్యం పైఅవగాహన కల్పించారు. ఇందులో భాగంగా నత్రజనిని విత్తేటప్పుడు 1/4వంతు విత్తినా నెల రోజులకు 1/2 వంతు, 50-55రోజులకు మిగిలిన 1/4 వంతు వేయాలన్నారు. మొక్క జొన్నలో ప్రధాన సమస్య అయిన కత్తెర పురుగు గూర్చి వివరించారు. కత్తెర పురుగు జీవిత చక్రం వర్షాకాలంలో 5 వారాలు అని, కత్తెర పురుగు బారిన పడిన మొక్కజొన్నకు ఎమామెక్టిన్ బెంజోయేట్, వేపమందు కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు తిరుమలరాజు, కృష్ణభగవాన్ రాజు, దంతులూరి చిట్టిబంగార్రాజు, ఎఇఒ ప్రశాంతి, రైతులు పాల్గొన్నారు.

వాలంటీర్‌కు అభినందన

వేపాడ : మండలంలోని బానాది గ్రామానికి చెందిన కలిగొట్లు దుర్గ అనారోగ్యంతో కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామ వాలంటీర్ సాయికుమార్ విశాఖ కెజిహెచ్‌కు బుధవారం వెళ్లి పించను డబ్బు అందించాడు. దీంతో గ్రామస్తులు వాలంటీర్‌ను అభినందిస్తున్నారు.


పింఛన్ ఇస్తున్న వాలంటీర్

వైసిపిపై ప్రజల్లో అసంతృప్తి

రాజాం : వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని మాజీమంత్రి కోండ్రు మురళీమోహన్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 1,2 వార్డులకు చెందిన సుమారు 70 కుటుంబాలు బుధవారం వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. వీరికి మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి శాసపు రమేష్ కుమార్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో రాజాం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కొనలేకే దాడులు

ప్రజాశక్తి - భోగాపురం

రాజకీయంగా తమను ఎదుర్కొనలేక లేనిపోని నిందారోపణలు చేస్తున్నారని జనసేన నెల్లిమర్ల నియోజకవర్గం నాయకులు లోకం నాగ మాధవి, మిరాకిల్స్ సాఫ్ట్‌వేర్ సిఇఒ లోకం ప్రసాద్ అన్నారు. బుధవారం మిరాకిల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమణలు చేశామని అధికార పార్టీకి చెందినవారు ఆరోపణలు చేస్తూ అధికారులను తమ భూముల పైకి పంపించి సర్వేలు చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మండలంలో అనేక లేఅవుట్‌లలో అక్రమంగా కాలువలు, వాగులు, ఆక్రమించి ఉన్నాయని వాటిని తొలగించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారా అని ప్రశ్నించారు. 2009లో రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టి సీసీఎల్‌ఏ నుంచి అనుమతులు ఇచ్చారని, వాగులు, కాలువలను ఆక్రమణలకు గురికాకుండా చూసుకోవాలని చెప్పారన్నారు. ఆ ప్రాతిపదికనే ముందుకు సాగుతున్నామని ఎక్కడ ఆక్రమణలకు తావు లేదని అన్నారు. సాఫ్ట్‌వేర్ సంస్థ ద్వారా అనేక మందికి ఉద్యోగ అవకాశాలు ఇస్తున్నామని, రాష్ట్రంలోనే అతిపెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీగా మిరాకిల్స్ సంస్థ ముందుకు సాగుతుందని గుర్తు చేశారు. తమపై బురద జల్లుతున్న విషయాన్ని ఇక్కడితో ఆపమని లోక్ అదాలత్‌కు, అవసరమైతే హైకోర్టుకు వెళ్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు, అధికారులు దొడ్డ దారిన వ్యవహరిస్తున్న తీరును మానుకోవాలని హితవు పలికారు.


అధికారులకు ఫిర్యాదు చేసిన లేఖనుచూపిస్తున్న మాధవి

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- రేగిడి

న్యాయవాదుల సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మిత్తి రెడ్డి జ్ఞానేశ్వర్ రావు అన్నారు. ఈ మేరకు బుధవారం రాజాం కోర్టు ఆవరణలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అమరావతి హైకోర్టు ఆవరణలో న్యాయవాదుల ఎన్నిక ప్రశాంతగా జరిగిందని ఈ ఎన్నికలో రాజాం మండలం సారధి గ్రామానికి చెందిన తనను హైకోర్టు గ్రంథాలయ కార్యదర్శిగా ఎన్నికున్నారని చెప్పారు. తన సమీప ప్రత్యర్థి బాలు అనీల్ కుమార్ పై గెలుపొందినట్లు ఆయన వెల్లడించారు. ఈ ఎన్నికల్లో న్యాయవాదుల సంఘం అధ్యక్షులుగా జానక రామిరెడ్డి గెలుపొందటం ఇది వరుసగా రెండవ సారి కాగా, ఉపాధ్యక్షుడిగా పిఎస్‌పి సురేష్ కుమార్ గెలుపొందారన్నారు. ప్రధాన కార్యదర్శిగా వి.సాయికుమార్, సంయుక్త కార్యదర్శిగా ఎం.సాల్మన్ రాజు, కోశాధికారిగా బీవీ అపర్ణలక్ష్మి గెలుపొందారని ఆయన తెలిపారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రజాశక్తి - వంగర

వేసవి దృశ్య మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమిష్టి కృషితో చర్యలు చేపడుతున్నట్లు ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ తెలిపారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని మద్దువలస, జగన్నాథవలస, వంగర, కొట్టిశ గ్రామాలలో ఇంటింటా కుళాయిలు ఇప్పటికే ఏర్పాటు చేశామని తెలిపారు. మిగతా అన్ని గ్రామాలలో కూడా ఇంటింట కులాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. పశువులు దాహార్తిని తీర్చేందుకు తోటపల్లి కుడికాలువ ద్వారా మండలానికి వస్తున్న సాగునీటిని రైతులు చెరువుల్లో నింపుకొని వినియోగించుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న ఎంపిపి

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని పేరాపురం పంచాయతీ పరిధిలో గల గొల్లపేటలో జరిగే భూ ఆక్రమణను రెవెన్యూ అధికారులు ఆపించాలని గ్రామస్తులు కోరుతున్నారు. సర్వే నంబర్ 113లో ఉన్న ప్రభుత్వ భూమిని ఇటీవల కొంతమంది ఆక్రమణకు పాల్పడుతున్నారు. జెసిబిలతో సదుని చేయించి ఫెన్సింగ్ పోల్స్ వేయిస్తున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారేంటని ఎవరైనా అడిగితే మాకు పట్టాలు ఉన్నాయని చెబుతున్నారు. 1996లో ఈ భూమికి సంబంధించి ఇళ్ల పట్టాలను మాకు ఇచ్చారని ఆక్రమణదారులు చెబుతున్నారు. పట్టాలు చూపించమంటే మా దగ్గర లేవని సమాధానం చెబుతున్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులు పరిశీలించి ఆక్రమణకు పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై తహశీల్దార్ భాస్కర్‌రావును వివరణ కోరగా తన దృష్టికి వచ్చిందని వెంటనే ఆక్రమణలను తొలగిస్తామని చెప్పారు.


అక్రమార్కులు చదును చేస్తున్న స్థలం ఇదే

వర్క్‌షాప్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- బొబ్బిలి

అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) ఉత్తరాంధ్ర జిల్లాల యూత్ వర్క్ షాప్ మార్చి 9వ తేదీన విజయనగరంలో ఉన్న కామ్రేడ్ దాసరి నాగభూషణరావు అమర్ భవన్ వద్ద నిర్వహిస్తున్నట్లు ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న తెలిపారు. బుధవారం బొబ్బిలిలో కామ్రేడ్ గంటి ప్రసాదం స్మారక భవనం వద్ద వర్క్ షాప్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న యువజన వ్యతిరేక విధానాల పైన సమావేశాల్లో చర్చిస్తారని ఈ వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ డివిజన్ నాయకులు తులసిరావు, మహమ్మద్, సతీష్ కుమార్ పలువురు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

బిసి, ఎస్‌సి, ఎస్‌టి వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వసతి గృహాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైందన్నారు.

నాడు నేడు ద్వారా హాస్టల్ విద్యార్థులకు నిధులు విడుదల చేసి, హాస్టల్ మరమ్మత్తులు పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వార్డెన్స్ కూడా కొరత వలన విద్యార్థుల తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపడేనా ?

ప్రజాశక్తి - గుర్ల

పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యమే మహాభాగ్యం అంటు అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాలకు వచ్చినప్పుడు ప్రసంగాలతో ఊదరగొడతారు. ఆచరణ పై మాత్రం దృష్టి సారించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాలలో దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలు, కాలువలలో బ్లీచింగు చల్లడం పంచాయతీల్లో అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. దీంతో గ్రామాల్లో దోమల బెడద తప్పడం లేదని వాపోతున్నారు.

మండలంలో సదానందపురం గ్రామంలో వీధి కాలువలలో చెత్త చెదారం పేరుకపోయింది. దీంతో కాలువలో మురుగు నీరు నిల్వ ఉండిపోయి దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించక పోవడంతో ఈ పరిస్థితి నెలకొందని గ్రామస్తులు అంటున్నారు. చెత్తా చెదారం రోడ్డు పక్కన వేయడం వల్ల మరింత అధ్వానంగా అపరిశుధ్యం తాండవిస్తుంది. ప్రభుత్వం ప్రజారోగ్య పై ఎంత ఖర్చు చేసినా పారిశుధ్య పనులు లోపం వల్ల ప్రజలు తరుచు అనారోగ్యానికి గురవుతున్నారని గ్రామస్తులు అంటున్నారు. వీధి కాలువల ఉన్న చెత్త చెదారం తొలగించి పారిశుధ్య పనులు మెరుగు పరచాలని గ్రామస్తులు కోరుతున్నారు.


కాలువలో పూడికలు

ఘనంగా సైన్స్ డే

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని రఘుమండ, మరిచర్ల, సారిక ఉన్నత పాఠశాలల్లో బుధవారం సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంవిజిఆర్ ఎఫ్‌వైఎఫ్‌పి యూనిట్ ఆధ్వర్యంలో 'ప్రాజెక్టు వికాస్'లో భాగంగగా ఈ సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రాజెక్టులను తయారు చేసిన విద్యార్థులకు నిర్వాహుకులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ డీన్ ఎస్.మోహన్ కుమార్, కెఎస్‌ఎన్ రాజు, ఎఫ్‌వైఎఫ్‌పీ కన్వీనర్ ఎన్. షణ్ముఖ రావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, పాఠశాల హెచ్‌ఎంలు, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు అవార్డులను అందిస్తున్న నిర్వాహుకులు

రమాప్రభకు మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి- బొబ్బిలి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి మణికుమార్ బుధవారం పట్టణంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై అవగాహన ఉన్న కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరారు. విద్యారంగ సమస్యలు, నిరుద్యోగ యువత సమస్యలపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలు శాసనమండలిలో పోరాటం చేస్తున్నారని చెప్పారు.


ప్రచారం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

జిల్లాలో శాశ్వత లోక్ అదాలత్ ప్రారంభం

విజయనగరం లీగల్ : సత్వర న్యాయం పొందేందుకు ఉమ్మడి జిల్లాల ప్రజలకు శాశ్వత లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందని ప్లాపస్ (పర్మినెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్) చైర్మన్ గరికిన దుర్గయ్య చెప్పారు. ఉచితంగా, వేగంగా న్యాయం పొందేందుకు ఇదొక ఉత్తమ వేదికగా ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాకు శాశ్వత లోక్ అదాలత్ స్థానిక జిల్లా కోర్టు సముదాయంలో బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దుర్గయ్య మాట్లాడుతూ, 2002లో ఎపి స్టేట్ లీగల్ సెల్ అథారిటీ ఏర్పాటు చేసినప్పుడు, విజయనగరం జిల్లాతోపాటు మరో మూడు జిల్లాల్లో శాశ్వత లోక్ అదాలత్‌లను ఏర్పాటు చేయలేదని చెప్పారు. ఇటీవలే జిల్లాకు మంజూరైన శాశ్వత లోక్ అదాలత్‌ను, ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా బుధవారం నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి సాధారణంగా మూడు నెలలకోసారి జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహిస్తు న్నామని, కానీ ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో కొత్త కేసులను మాత్రమే విచారణ చేస్తామని చెప్పారు. ఇక్కడ విచారించే కేసుల్లో రాజీ కుదరకపోతే, తుది తీర్పుకూడా ఇక్కడే ఇవ్వడం జరుగుతుందని, మరో న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం లేదని స్పష్టం చేశారు. బాధితులు లేదా సాధారణ పౌరులు న్యాయవాది ద్వారా గానీ, లేదా నేరుగా గానీ తమను ఆశ్రయించి, న్యాయం పొందవచ్చునని తెలిపారు.ప్రధానంగా పది రకాల ప్రభుత్వ, ప్రభుత్వేతర ప్రజా సేవలకు సంబంధించి, తమను ఆశ్రయించవచ్చునని తెలిపారు. వీటిలో పరిహారం సుమారు కోటి రూపాయలు వరకు అవకాశం ఉన్నకేసులు తమ పరిధిలోకి వస్తాయని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ దుర్గయ్య తెలిపారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవల సంస్థ కార్యదర్శి బిహెచ్‌వి లక్ష్మీకుమారి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్లాపస్ చైర్మన్ గరికిన దుర్గయ్య

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

సీతంపేట: కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ ఐదో తేదీన చలోఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు తెలిపారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బిజెపి అధికారం చేపట్టినప్పటి నుండి కార్పొరేట్ అధిప తులకు దాసోహమై సామాన్యులను, రైతులను, కార్మికులను తీవ్ర ఇబ్బందులు గురిచేస్తోందని విమర్శించారు. కార్మికులు, ఉద్యోగులకు ఉన్న పెన్షన్ సౌకర్యాన్ని రద్దు చేస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లేకుండా చేసిందన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాలతో ఉద్యోగ భద్రతను లేకుండా పోయిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి సామాన్యుల జీవనానికి తీవ్ర నష్టం కలిగించిందన్నారు. ఈ నేపథ్యంలో బిజెపి అవలంబిస్తున్న ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించి, ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

స్కార్పియో ఢీకొని తండ్రి మృతి

కుమారుడు పరిస్థితి విషమం

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

విజయనగరం మండలంలో చెల్లూరు సమీపంలో స్కార్పియో కారు ఢీకొని బైక్ మీద వెళ్తున్న ఇద్దరిలో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన బుధవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గొల్లల పేటకు చెందిన తండ్రి, కుమారులు ఈగల కృష్ణ (60), ఈగల రామకృష్ణ (35) ద్విచక్ర వాహనం మీద సొంత పని మీద చిన్నాపురం జంక్షన్ నుంచి తమ ఊరి వైపు యూ టర్న్ తీసుకునేందకు రాంగ్ రూట్‌లో వెళ్లారు. అదే సమయంలో విశాఖ నుంచి సాలూరు వైపు వెళ్తున్న పశ్చిమగోదావరికి చెందిన వర్మ స్కార్పియో కారుతో బైక్‌ను బలంగా ఢీ కొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన తండ్రీ కొడుకులను 108 వాహనంలో నగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, ఈగల కృష్ణ అక్కడ చికిత్స పొందుతూ చనిపోయారు. కుమారుడు పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ ఎస్ఐ బి. గణేష్ తెలిపారు

సారిపల్లిలో ఇల్లు దగ్ధం

నెల్లిమర్ల : మండలంలోని సారిపల్లి గ్రామంలో నెయ్యల వీధికి చెందిన తాటిపూడి సూరప్పుడుకు చెందిన కమ్మరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల కాలిపోయింది. వెంటనే స్పందించిన గ్రామస్తులు మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారుగా లక్ష రూపాయలు నష్టం జరిగిందని బాధితుడు చెబుతున్నాడు.


మంటలను అదుపు చేస్తున్న గ్రామస్తులు